# బ్యాచ్‌ఫ్లవర్ రెమిడీస్ అంటే...?

హోమియో...



డాక్టర్ రాజశేఖర్,
ఫ్యూర్‌కేర్ హోమియోపతి

నాకు తరచు నోటి పూత వస్తుంటే బోరాక్స్, మెర్క్‌సాల్ వంటి మందులు వాడాను. సమస్య చాలా త్వరగా నయమైంది. ఇటీవల మా స్నేహితునికి కూడా అదేవిధంగా వస్తే అవే మందులు వాడమని చెప్పాను. అయితే హోమియో మందులలో స్టెరాయిడ్స్ ఉంటాయని, ఈ మందులు వాడితే సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని సందేహం వెలిబుచ్చాడు. నిజమేనా? బ్యాచ్‌ఫ్లవర్ రెమిడీస్ అంటే ఏమిటి?

– రోహిత్, నెల్లూరు

హోమియో మందులలో స్టెరాయిడ్స్ ఉంటాయన్నది చాలాకాలం నుంచి ఉన్న అపోహ. హోమియో మందులు చెట్ల నుంచి, జంతువుల నుంచి, మూలకాల నుంచి, వ్యాధి సోకిన భాగాల నుంచి, ఆరోగ్యకరంగా ఉన్న శరీర భాగాల ఉత్పత్తుల నుంచి, పున్నమి వెన్నెల కిరణాలు, ఎక్స్ కిరణాల నుంచి తయారు చేస్తారు. హోమియో మందులలో మూల స్వభావం ఉండదు. కేవలం మెడిసినల్ క్వాలిటీ మాత్రమే ఉంటుంది. ఉదాహరణకు కొన్ని వందల గ్రాముల స్టెరాయిడ్స్ వాడటం వలన వచ్చిన దుష్ఫలితాలను మిల్లీగ్రాములో పందోవంతు హోమియో మందుతో నయం చేయవచ్చు. మీరు నోటిపూతకు వాడుతున్న బోరాక్స్, మెర్క్‌సాల్ వంటి మూలకాలు స్టెరాయిడ్స్ కావు.

ఇక స్టెరాయిడ్స్ విషయానికి వస్తే వాటిని లైఫ్ సేవింగ్ డ్రగ్స్ అంటారు. అంటే ప్రాణాన్ని నిలిపే మందులన్నమాట. అయితే వాటిని కేవలం అత్యవసర పరిస్థితులలో నిపుణుల పర్యవేక్షణలోనే వాడాలి. కాని కొందరు సాధారణ జ్వరం, దగ్గు, కండరాలు, కీళ్లనొప్పులకు కూడా వాడుతుంటారు. ఇలా స్టెరాయిడ్స్‌ను విచ్చలవిడిగా వాడటం వల్ల గుండె, ఎముకలకు సంబంధించి శరీరానికి తీవ్రమైన హాని చేసే సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చు. కొన్ని వ్యాధులను నయం చేయడానికి హోమియోలో స్టెరాయిడ్స్ నుండి తయారైన మందులు ఇప్పుడు కనుక్కొంటున్నారు.

హోమియో మందులలో బ్యాచ్‌ఫ్లవర్ మందులు అని పుష్పాల ద్వారా తయారుచేసిన మందులు ఉన్నాయి. వీటిని రోగి మానసిక పరిస్థితులను ప్రామాణికంగా తీసుకుని ఇస్తారు. వీటిలో రెస్క్యూ రెమిడీ అనే మందు స్టెరాయిడ్ మాదిరిగా శీఘ్రంగా పనిచేస్తుంది. కాబట్టి దీనిని హోమియోపతిక్ స్టెరాయిడ్ అని కొందరు వైద్యులు పిలుస్తుంటారు.

హోమియో మందులలో ఎటువంటి దుష్ఫలితాలూ ఉండవని అందరికీ తెలిసిందే. అలాగే స్టెరాయిడ్స్ కూడా ఉండవు. కాబట్టి మీరు నిర్భయంగా ఈ మందులు వాడవచ్చు.



నా వయసు 17. నేను రెండు సంవత్సరాలుగా సోరియాసిస్‌తో బాధపడుతున్నాను. డాక్టర్ సలహాపై స్టెరాయిడ్స్ వాడాను. ప్రస్తుతం హోమియో మందులు వాడుతున్నాను. మూడునెలలు గడిచినా నా పరిస్థితి ఏమంతగా మెరుగుపడలేదు. పైగా ఒళ్లు బాగా వెచ్చబడుతోంది. సోరియాసిస్ ప్యాచెస్ కూడా ఎక్కువవుతున్నాయి. కాళ్లు, చేతులు ముడిచినప్పుడు నొప్పిగా ఉంటోంది. ఈ పరిస్థితులలో నేనేం చేయాలో సలహా ఇవ్వగలరు.

– జి. రవీందర్, ఇ.మెయిల్

సోరియాసిస్ వ్యాధికి స్టెరాయిడ్స్ వాడినప్పుడు ప్యాచెస్ తగ్గిపోతాయి కాని మానేయగానే కనిపిస్తాయి. మీరు హోమియో చికిత్స మొదలు పెట్టిన తర్వాత స్టెరాయిడ్స్ వాడటం మానినట్లయితే సోరియాసిస్ తాలూకు దుష్ప్రభావాలు ఇంతకు ముందుకన్న అధికంగా బయటపడతాయి. హోమియోలో కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో మందులు వాడుతున్నప్పటికీ మీరు వాడుతున్న స్టెరాయిడ్స్ ఆకస్మికంగా కాకుండా నెమ్మదిగా తగ్గిస్తూ, తర్వాత పూర్తిగా మానేయాలి. సోరియాసిస్ దీర్ఘకాలిక వ్యాధి. అది తగ్గడానికి ఆ వ్యాధి తీవ్రతను బట్టి, రోగి మానసిక పరిస్థితిని బట్టి మూడు నుంచి నాలుగు సంవత్సరాలు పట్టవచ్చు. కాబట్టి మీరు హోమియో మందులను వైద్యుని పర్యవేక్షణలో దీర్ఘకాలం పాటు వాడవలసి ఉంటుంది.